క్లుప్తంగా

చేనేత కుటుంబాన్ని ఆదుకోవాలి

భట్టిప్రోలు: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న అనంతపురం జిల్లా కేశేపల్లికి చెందిన చేనేత కార్మికుడు నాగానంద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యన్నారాయణ కోరారు. మంగళవారం భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాల ధరలు విపరీతంగా పెరిగి అమ్ముడు పోక నిల్వ ఉండటంతో వస్త్రాల తయారీకి చేసిన అప్పులు తీర్చలేక అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేనేత పరిశ్రమ రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు బి.నాగమల్లేశ్వరరావు, చేనేత నాయకుడు ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండరు ఆవిష్కరణ



తెనాలి: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండరును మంగళవారం తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరణ అనంతరం తెలుగు క్యాలెండరును తెనాలి డీఎస్పీ, త్రీటౌన్ పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి అందరికీ అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. తెలుగు నెలలు అనుసరించేందుకు వీలుగా తెలుగు తిథులతో, ఆంగ్ల తేదీలతో కాలసూచికను తీసుకొచ్చినట్లు వివరించారు.

రంజాన్ తోఫా అందజేత

తెనాలి: పట్టణ చినరావూరు 13వ వార్డులోని ముస్లిం కుటుంబాలకు మంగళవారం సాయంత్రం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ బాబు ఆధ్వర్యంలో అక్కడి ముస్లిం సోదరులతో ఏర్పాటైన సమావేశంలో దాదాపు వంద మందికి రంజాన్ తోఫా అందజేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పండుగ సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. నిర్వాహకులను అభినందించారు. పఠాన్ ఖాజా, పఠాన్ షరీఫ్, కుర్రా శ్రీను, గుంటూరు కోటేశ్వరరావు, మన్నవ ప్రభాకర్, వీరయ్య, కంచర్ల శ్రీను, నాగరాజు, షేక్ షఫీ, సయ్యద్ మస్తాన్, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



తెనాలిటౌన్: కొత్తపేటలోని విశ్వకర్మ దేవాలయం ఆవరణలో శ్రీ ఆంజనేయం ధ్యాన యోగా మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా తులసి ఆకుల చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కిషోర్ గురూజీ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు చలివేంద్రం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వకర్మ దేవాలయ చైర్మన్ నూతలపాటి సురేష్, చలివేంద్రం కన్వీనర్ తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, ముంతా శ్రీనివాసరావు, కోమల, కుమారి చంద్రిక, గొడవర్తి సత్యనారాయణ, దూపుగుంట్ల రమేష్, సుబ్బారావు, సూర్యనారాయణ, వరలక్ష్మి, గుప్తా, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

దేవుని సేవకులు ఐక్యతగా ఉండాలి

తెనాలిటౌన్: దేవుని సేవకులు ఐక్యతగా ఉండాలని దేవుడిని నమ్ముకుంటే గొప్ప కార్యాలు సాధించగలమని ఈరే మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ సుధీర్‌కుమార్ అన్నారు. రూరల్ మండలం నందివెలుగు ఇందిరా కాలనీలోని యెహోవా ఈరే చర్చిలో మంగళవారం తెనాలి మండల పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. సమావేశానికి ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎ.భానుప్రసాద్ అధ్యక్షత వహించగా ఫెలోషిప్ కోశాధికారి ఎం.బర్నబాసు స్వాగతం పలికారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తుకు అసాధ్యమైన కార్యములు ఏమిలేవని అన్నారు. ఫెలోషిప్ ద్వారా మండల గ్రామాల్లో దైవసేవకులు పరిచర్యలను చేయాలని సూచించారు. ప్రార్థన కూడికలు నిర్వహించే పాస్టర్లు దైవసేవకులకు నిర్వహణ నిమిత్తం ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రెసిడెంట్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ఫెలోషిప్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి నెల రెండో మంగళవారం ఫెలోషిప్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో సెక్రటరీ రాకడ పీటర్ పాల్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, కోశాధికారి బర్నబాబు, జాయింట్ సెక్రటరీ సువర్ణరాజు, ఎగ్జిక్యూటివ్‌మెంబర్స్ అజిత్, యోబు, ఏసుబాబు, లోకా, బిషప్ జడ్సన్, రెవరెండ్ ఎం.జానుబాబు, క్రిస్టఫర్, రాజశేఖర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల మహేష్, మండల పరిధిలోని పలువురు పాస్టర్లు, దైవసేవకులు పాల్గొన్నారు.

ఆలయాలకు నూతన సంవత్సరాది శోభ

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్త జనం
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన దేవతామూర్తులు
- పలు చోట్ల క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం వినిపించిన పండితులు



భట్టిప్రోలు గ్రామ దేవత శ్రీ దండిపార్వతి అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో అద్దేపల్లి గ్రామ దేవత శ్రీ ఆడెమ్మ తల్లి



వెల్లటూరులో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ దేవతామూర్తులు



రుక్మాభాయి సహిత పాండురంగ స్వామి



ప్రత్యేక అలంకరణలో గ్రామదేవత బూరుగులమ్మ

రేపల్లెరూరల్: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మంగళవారం నియోజకవర్గంలో ప్రజలు ఉల్లాస భరిత వాతావరణంలో నిర్వహించుకున్నారు. రేపల్లె పట్టణ గ్రామ దేవత శ్రీ బూరుగులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పెదకూరగాయల మార్కెట్ సమీపంలోని విఘ్నేశ్వరుని ఆలయం, ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం, ఉప్పూడి రోడ్డులోని శ్రీ గోదా రాజ్యలక్ష్మి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉగాది పర్వదిన వేడులను నిర్వహించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

భట్టిప్రోలు: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం దేవాలయాల్లో పంచాంగ శ్రవణం గావించారు. భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామ దేవతలు శ్రీ దండి పార్వతి, శ్రీ ఆడెమ్మ అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం శ్రీ ఆడెమ్మ తల్లి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయంలో యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు. ఆయనను ఘనంగా సన్మానించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ మహా గణపతి, శ్రీ లక్ష్మీ గణపతి పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలోని వెల్లటూరులో కొలువైన శ్రీ అగస్తేశ్వర స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. కార్యక్రమాన్ని కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. మండలంలోని పెదపులివర్రులో కొలువైన శ్రీ గోగులమ్మ, శ్రీ రాజరాజ నరేంద్రస్వామి, శ్రీ వరదరాజస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. వెల్లటూరులో కొలువైన శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

చినపరిమిలో పంచాంగ శ్రవణం

చుండూరు(భట్టిప్రోలు): ఉగాది పర్వదినం పురస్కరించుకుని చుండూరు మండలం చినపరిమిలో కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వార్లకు మంగళవారం పంచామృత అభిషేకాలు జరిగాయి. సాయంత్రం పండిత మామిళ్లపల్లి సత్యన్నారాయణచే పంచాంగ శ్రవణం జరిగింది. భక్తులు పంచాంగ శ్రవణాన్ని ఆలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రారంభమైన భజన సంకీర్తనలు

భట్టిప్రోలు: ఉగాది పర్వదినం పురస్కరించుకుని సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి శ్రీరామనవమి వరకు అన్ని దేవాలయాల్లో భజన సంకీర్తనలు నిర్వహించనున్నారు.ఈ సంకీర్తనా కార్యక్రమాలు వసంత నవ రాత్రులు జరుగుతాయని బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలో శ్రీ రుక్మాభాయి సహిత పాండురంగస్వామి దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం జరిగింది. పూజా కార్యక్రమాలను అర్చకులు ధారా నారాయణమూర్తి శాస్త్రయుక్తంగా నిర్వహించారు.



భట్టిప్రోలు శివాలయంలో వంగర చలమయ్య సిద్ధాంతికి సన్మానం



చినపరిమిలో పంచాంగ శ్రవణాన్ని ఆలకిస్తున్న భక్తులు



బూరుగులమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవత శ్రీ కట్లమ్మ తల్లి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఋతువులు ఆధారంగా రూపొందించిన ఈ క్యాలెండర్ తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుందని దేవాలయ ప్రధాన అర్చకులు క్రోవి రామకృష్ణ తెలిపారు. వాడుకలో ఉండే ఆంగ్ల సంవత్సరాది క్యాలెండర్‌కు ప్రత్యామ్నాయంగా ఉగాది నుంచి మళ్లీ వచ్చే ఉగాది వరకు తెలుగు సంప్రదాయాన్ని అనుసరించి క్యాలెండర్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు, భజన కమిటీ మహిళలు పాల్గొన్నారు.



తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

పిట్టలవానిపాలెం: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా వివిధ దేవాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణలో చిన్నారులు, యువతీ, యువకులు దేవాలయాల్లో పూజలు చేశారు. షడ్రుచుల ఉగాది పచ్చడి తిన్నారు. మండలంలోని చందోలు బండ్లమ్మ దేవాలయం, అల్లూరు శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, ఖాజీపాలెం శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.కార్యక్రమంలో బండ్లమ్మ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

తెలుగు సాహితీ వేత్తలు ఆదర్శనీయులు

బాపట్ల: తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి తమ జీవితాన్ని అంకితం చేసిన సాహితీ వేత్తలను స్మరించుకోవడం నేటి తరం యువ కవుల ప్రధాన లక్ష్యమని బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యామ్ సుందర్ అన్నారు. భావపురి విద్యాసంస్థల ప్రాంగణంలో క్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవంలో ఆయన మాట్లాడారు. ఎందరో ఉత్తమ సాహితీ వేత్తలకు జన్మనిచ్చిన బాపట్ల అలనాటి సాహితీ పరంపరను నేటికీ కొనసాగిస్తూ ఉండడం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రాచీన సాహిత్యాన్ని పఠిస్తూ, ఆధునిక కవుల సృజనాత్మకతలోని మెలకువలను అనుసరిస్తూ నేటి యువ కవులు తమ కలాలకు పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాషా వికాసానికి యువ కవులే ఆదర్శం కావాలని ఆయన అన్నారు. ఉపాధ్యక్షులుగా పోలాసం వీరాంజనేయులు, పడలి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నందిరాజు విజయకుమార్, సహాయ కార్యదర్శిగా డాక్టర్ మేకల రాజు, టెక్నికల్ సెక్రటరీగా షేక్ బాబావాలి, ముఖ్య కోశాధికారిగా ఆక్సీ నూర్ బాషా ఖాసిం, కోశాధికారిగా అన్నం పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారని తెలిపారు. పోగుల విజయశ్రీ,, బత్తుల బ్రహ్మారెడ్డి గౌరవ అధ్యక్షులుగా, కార్యనిర్వాహక సభ్యులుగా పాత కమిటీ సభ్యులే కొనసాగుతారని ఆయన తెలిపారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పోలాసం వీరాంజనేయులు, ఆక్సీ, షేక్ బాబావలి, నాగ మనోహర్ లోహియా తదితరులు పాల్గొని తమ కవితల ద్వారా తెలుగు భాష విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి నందిరాజు విజయకుమార్ పర్యవేక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు శ్యామ్‌సుందర్

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పొన్నూరు: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని చాందినీ చౌక్ సెంటర్‌లో ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, అంబటి మురళీకృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థన నిర్వహించి ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అల్లా చెప్పిన విధంగా తోటి వారిపై ప్రేమ, దయ, జాలి, కరుణ చూపిస్తూ, తోచిన సహాయ సహకారాలు చేయడం అన్నది ఆదర్శప్రాయ మార్గం అన్నారు. ఈ మంచి గుణం అందరిలోనూ ఉంటే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుందన్నారు. అల్లా దివ్య ఆశీస్సులు మానవాళి అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ రూత్ రాణి, నాయకులు బడా గోరా, నన్న గోరా, అడిది మౌలాలి, వడ్రాణం ప్రసాద్, షేక్ నాజర్, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, అమిరినేని సాంబశివరావు, ఆకుల రామ్మోహన్, బోయి నాగరాజు, సయ్యద్ సుభాని, రుద్రపాటి ఆదిశేషులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అంబటి మురళీకృష్ణ

జగనన్న పాలనలో సంక్షేమ లబ్ధి

కొల్లూరు : ప్రజా సంక్షేమమే పరమావధిగా నిస్వార్థ పాలన సాగించిన సీఎం జగన్ తిరిగి అధికారంలోకి వస్తే ఆయన పాలనలో సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగుతుందని వేమూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి వరికూటి లక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె అమృతలూరు మండలం కోటి తాడిపర్రులో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఆర్థిక పురోగతికి దోహద పడిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకువస్తే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి సతీమణి లక్ష్మి

కుయ్..కుయ్.. రయ్..రయ్!

కొద్దిరోజుల పెదనందిపాడు మండలంలోని చిననందిపాడులో వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళా కూలీలపై పొలంలోని పురుగు మందు అవశేషాల ప్రభావం పడింది. సుమారు పాతికమందికి పైగా కూలీలు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకున్నారు. ఆందోళనకు గురైన స్థానికులు 108కు ఫోన్ చేశారు. అంతే నిమిషాల వ్యవధిలో ఇటు ప్రత్తిపాడు మండలం నుంచి అటు చిలకలూరిపేట నుంచి మరోవైపు పర్చూరు నుంచి నిమిషాల వ్యవధిలో ఐదు 108 వాహనాలు కుయ్ కుయ్ కుయ్ అంటూ ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అస్వస్థతకు గురైన వారిలో కొందరికి అక్కడికక్కడే అత్యవసర చికిత్సను అందించి అందించి, మరింత మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సకాలంలో వాహనాలు రావడంతో పెద్ద పెను ప్రమాదం తప్పింది.

- 108 వాహనం ద్వారా ప్రజలకు విస్తృత సేవలు
- ఫోన్ చేసిన నిమిషాల్లోనే ఘటనా స్థలికి దూసుకొస్తున్న అంబులెన్స్
- క్షతగాత్రులు, బాధితులకు కొండత బాసట
- చంద్రబాబు హయాంలో 108 వాహనాలకు దుర్గతి
- పునర్జీవం పోసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు

ప్రత్తిపాడు: 108 అంబులెన్స్ ద్వారా ప్రాణాలు కాపాడిన సందర్భాలు ఎన్నెన్నో. అది ప్రమాదమైనా, పెను విపత్తయినా, అఘాయిత్యమైనా, అత్యవసరమైనా.. బాధితులను, రోగులను ఆస్పత్రులకు తరలించడంలో 108 సేవలు మాటల్లో చెప్పలేనివి. వేల మందిని సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడటంతో పాటు అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించడంలో 108 వాహనం, సిబ్బంది పాత్ర అనిర్వచనీయం. ఫోన్ మోగితే చాలు.. కుయ్ కుయ్ కుయ్ అంటూ వాయువేగంతో నిమిషాలు, క్షణాల్లో ఘటనా స్థలికి చేరి బాధితులకు బాసటగా నిలుస్తుంది. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పురుడుపోసుకున్న 108 వాహనాలు ఎందరికో ప్రాణభిక్షను పెట్టాయి.



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న 108 వాహనం

ఆపద్బాంధవిలకు పునర్జీవనం..

కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. 2019లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 108 వాహనాలకు జీవం పోశారు. 108 వాహనాలపై దృష్టి కేంద్రీకరించారు. కోట్ల రూపాయలు వెచ్చించి అధునాతన 108 వాహనాలను కేటాయించారు. ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే బాధితులకు 108 సేవలు నిరంతరాయంగా అందుతున్నాయి. అర్ధరాత్రి వేళల్లోనూ క్షణాల వ్యవధిలో బాధితులకు అత్యవసర సాయం అందుతోంది.

మండలానికొకటి చొప్పున..

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాలకు గాను ఒక్కో మండలానికి ఒక్కో నూతన 108ను కేటాయించారు. వీటిద్వారా నియోజకవర్గంలోని 96 గ్రామాల ప్రజలకు విస్తృత సేవలు ఆపత్కాలంలో అందుతున్నాయి. గర్భిణులు, గుండెపోటు, ప్రమాద బాధితులు, క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడేవారు, అర్ధరాత్రి వేళ విషసర్పాల కాటుకు గురయ్యేవారు. ఇలా ఎందరికో వాహనాల ద్వారా సేవలందిస్తున్నారు.

ఏడాది కాలంలో అందించిన సేవల వివరాలు..

2023 జనవరి నుంచి 2024 మార్చి వరకు నియోజకవర్గంలోని కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండలాల్లో మొత్తం 6,626 మందికి 108 వాహనాల ద్వారా అత్యవసర సేవలు అందించారు. గర్భిణులకు సంబంధించి 751, ఆర్‌టీఏ కేసులు 762, డయాలసిస్ రోగులకు 834, ఇతరులు 4,579 మందికి సేవలందాయి.

చంద్రబాబు హయాంలో మూలన..

108 వాహనాలకు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో దుర్గతి పట్టింది. వాహనాల బాగోగులు పట్టించుకోకపోవడంతో మార్గమధ్యలో ఎక్కడ ఆగిపోతాయో, ఎప్పుడు మొండికేస్తాయో తెలియని పరిస్థితి చోటుచేసుకుంది. అంతేకాకుండా నియోజకవర్గానికి ఒక వాహనం మాత్రమే ఉండటం, అది కూడా ఎక్కడ నిలిపి ఉంటుందో, ఎప్పుడు, ఏ సమయానికి వస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. రోజుల తరబడి దవాఖానాల ముంగిట 108 వాహనాలు మొరాయించి మూలకు చేరి కనిపించేవి. ఇక మారుమూల ప్రాంతాల ప్రజలైతే అర్ధరాత్రి అత్యవసర వేళల్లో స్థానిక ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యేవి. ఆటోవాలాల ఇంటి తలుపులు కొట్టి ఆస్పత్రులకు తీసుకువెళ్లమని ప్రాధేయపడాల్సి వచ్చేది.

నేటి నుంచి కోన ఎన్నికల ప్రచారం

పిట్టలవానిపాలెం: మండల పరిధిలో గల గ్రామాలలో బుధవారం నుంచి వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ అభ్యర్థి కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం సా యంత్రం 4 గంటలకు అల్లూరు, అలకాపురం, ఖా జీపాలెం, పోతనకట్ల వారిపాలెం గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీతో మెరుగైన సంక్షేమం

కొల్లూరు : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలందరికీ మరింత మెరుగైన సంక్షేమ ఫలాలు అందనున్నాయని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కుమారుడు వరికూటి శ్రీతేజస్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని చింతర్లంకలో ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, ప్రజలకు మేలు చేసే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీకి ప్రజలంతా మద్దతుగా నిలిచి వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌లను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు సనక వెంకట్రావు, గొల్లపూడి వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ వెలివల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, నాయకులు తోడేటి లాజర్, నాంచారయ్య, ఉప్పు శ్రీనివాసరావు, కోగంటి కోటేశ్వరరావు, కూరేటి కోటేశ్వరరావు, పరిశుద్ధబాబు, పులివర్తి అంజయ్య, బిట్రగుంట సత్యనారాయణ, కట్టుపల్లి సోమయ్య, నవరాల నాంచారయ్య, పిల్లి బుజ్జి, ఉప్పు సుబ్రమణ్యం, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా గాంధీనగర్‌లోని శ్రీ షిరిడీ సాయి వృద్ధాశ్రమంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు అన్నదానం చేశారు. సంగారెడ్డి గ్రామస్తులు తలారి నరసింహులు వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగా టీచర్ బి.సుజాత మాట్లాడుతూ ప్రతి రోజు వృద్ధులు యోగా, ధ్యానం చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతులు అవుతారని తెలిపారు. ఉగాది పండుగ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపి ఉగాది పచ్చడిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, తేజశ్రీ, నరసింహ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి

తెనాలిటౌన్: నెహ్రూరోడ్డులోని రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధన స్వామి దేవాలయ ఆవరణలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా మంగళవారం రాత్రి సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించారు. విజయవాడకు చెందిన శాంత బృందం సభ్యులు వివిధ వాగ్గేయ కరకృత్తులు(రామపదమైన), కీర్తనలు గానం చేశారు. వయోలిన్‌పై చావాలి శ్రీనివాస్ (విజయవాడ), మృదంగంపై కెవి.రామకృష్ణ (తెనాలి) సహకరించారు. అనంతరం పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ పర్యవేక్షించారు.



వైభవంగా అంకమ్మతల్లి ప్రతిష్టా మహోత్సవాలు

స్వామి వార్లకు, గ్రామదేవతలకు నూతన వస్త్రాలు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో పునర్నిర్మించిన అంకమ్మతల్లి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పన్నెండవ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు ప్రత్తిపాడులో కొలువుదీరిన దేవతామూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సుప్రసిద్ధ గంగాపార్వతీ సమేత దండేశ్వారాలయంలో, వేణుగోపాల, సీతారామస్వామివార్ల దేవాలయం, విఘ్నేశ్వరాలయం, మళయాల పరమేశ్వరస్వామి దేవస్థానం, రామాలయాలతో పాటు గ్రామదేవతలకు, అమ్మవార్లకు, తాంబూల సహిత నూతన వస్త్రాలను స్వామివార్లకు, అమ్మవార్లకు సమర్పించారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.